డయ్యా. గమనించి, తల నిమురుతూ 'రామప్పా! రోజూ తరవాణి తినడం మానకు నాయనా. తినడం తప్పు కాదు. తండ్రిగా నే చెపుతున్నాను 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం". అంటూ అస్పష్టం గానూ, సౌంజ్ఞల ద్వారాను చెప్పాడయ్యా.

అప్పట్నుంచీ, తండ్రిమాట ప్రకారం తరవాణి తిని, కడుపు చల్లబడగా; చల్లని తల్లి ఆ తరవాణికుండ యిచ్చిన శక్తితో, తండ్రి దీవెనతో వుత్సాహంగా తన వృత్తి కొనసాగిస్తూ వచ్చాడయ్యా రామశాస్త్రి.

అలా రోజులు గడుస్తుంటే వచ్చిన దానితో సంతృప్తి పడుతూ కుటుంబ భారం వహించాడయ్యా. అతనికిపాతికేళ్ళు వచ్చేసరికి, పొరుగూర్లోవున్న సామాన్య కుటుంబీకుడు, అతని గుణానికి ముచ్చట పడి తన కూతుర్నిచ్చి వివాహం చేసా డయ్యా. వివాహమయ్యాక లక్ష్మి,సరస్వతి, పార్వతుల్లా ముగ్గురు పిల్లలు పుట్టుకొచ్చా రయ్యా.

అన్ని రోజులూ ఒక్కలాగానే, అన్ని రోజులూ ఆనందంగానే గడిచిపోతున్నా యయ్యా రామశాస్త్రికి.

కాలం ఒకరికోసం ఆగదు.సంతోషానికీ విషాదానికీ అతీతమైనది కాలం. ఒక క్షణంలో మరో క్షణాన్ని మిళితం చేసుకుంటూ, ఒక నిమిషంలో మరో నిమిషాన్ని లయం చేసుకుంటూ సాగిపోతూనే వుంటుంది. అన్నింటికీ అతీతంగా, వెనక చూపు లేకుండా ముందుకే మున్ముందుకే వెళ్ళిపోతూ వుంటుందయ్యా కాలం.

కుమ్మరి సారెలా, మార్పులేని పరిభ్రమణంలో రామశాస్త్రి రోజులు వెళ్ళదీస్తున్నా డయ్యా. ఆ పరిభ్రమణంతో శృతి తప్పి, నలభయ్యో పడిలో ప్రవేశించబోతున్న తరుణంలో.రామశాస్త్రి బతుకులోంచి అన్ని బంధాలు తెంచుకుని తండ్రి తప్పుకున్నా డయ్యా. నెల రోజులు తండ్రి పోయిన దుఃఖాన్ని భరించాడయ్యా ఆ అర్భకుడు.

కాలం ఆగదు, బాధ్యతలు వదలవు ఏ జీవికయినా. మొదటి మాసికం పూర్తయ్యాక, కంచు చెంబు తీసుకుని మళ్ళీ సంచారానికి వీధిన పడ్డాడయ్యా రామశాస్త్రి.

తరవాణి తినే రామశాస్త్రి అలవాటు తెలిసిన కొందరు పెద్దలు అతన్ని పిలిచి, "నాయనా నీ తండ్రి వేద పండితుడు. ఉత్తముడు. కాలం తీరిపోయింది. ఆ లోటు భర్తీ చేయడం అసాధ్యం. ధీరోదాత్తంగా ఆదుఃఖాన్ని భరించావు నువ్వు.చాలా ఆనందంగా వుందయ్యా. నీకు తరవాణి తినే అలవాటుందని మాకు తెలుసు. ఇక నుంచి నువ్వు ఆ విధంగా చెయ్యకూడదు. అది ధర్మ విరుద్ధం. అందుకని...."అని అన్నా రయ్యా.

అప్పట్నుంచీ ఆ అలవాటు మానేశా డయ్యా రామశాస్త్రి. పదిహేను రోజులయిం దయ్యా.

చిన్నప్పట్నుంచీ అలవాటైన ఆహారం. నది నీళ్ళు తిరగడానికి శక్తినిచ్చి పోషించిన చల్లని తల్లి ఆ తరవాణి కుండ. ఒక్కసారిగా వదిలెయ్యడంతో అతనికి చాలా బాధగాను. శరీరానికి చాలా నీరసంగానూ వుండ సాగింది. అనివార్యమై ప్రాణం పీకుతోంది. కానీ, పెద్దల హెచ్చరిక అతన్ని కట్టి పడేస్తోందయ్యా.

రామశాస్త్రి అడుగులు కొలుస్తున్నాడు. కాళ్ళు పీకుతున్నాయి. మాఘమాసపు ఎండ పది గంటలకే మాడు చుర్రుమని పిస్తోంది. ఉత్తరీయం తల మీద కప్పుకొన్నాడు. శక్తిని కూడదీసుకుని ముందుకు నడిచాడు.

రామశాస్త్రి వచ్చేసరికి, సదాశివశాస్త్రిగారు దేవతార్చన ముగించుకుని అరుగుమీద కూర్చుని వున్నారు. ఆయనంటే అపరిమితమైన భక్తిప్రపత్తులయ్యా రామశాస్త్రికి. ఆయిన మాట అతనికి శిరోధార్యం. ఆయన్ని చూస్తుంటే అపరశంకరుణ్ణి చూసి నట్టుగా వుంటుందతనికి.

అరుగు కింద నుంచే ఆయనకి నమస్కారం చేశాడు.

"రామయ్యా.ఏమిటలా తేలిపోతున్నావు" ఒంట్లో బాగాలేదా" అని సాదరంగా అడిగా రయ్యా సదాశివశాస్త్రిగారు.

ఆయనకి తన బాధని చెప్పుకున్నా డయ్యా రామశాస్త్రి. అంతా విని "చూడు నాయనా. అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఈ సృష్టిలో సమస్త ప్రాణులు అన్నాధారాలు. ధర్మాన్ని పరిరక్షించడం మానవ కర్తవ్యం. ధర్మాన్ని సంరక్షించడానికి శరీరం అత్యవసరం శరీరాన్ని శుష్కింప జేసి, ధర్మాన్ని కాపాడాలని ఏ శాస్త్రం లోనూ లేదు. వికటించిన నైరాశ్యానికిపోయి, ధర్మహాని చెయ్యకూడదు. అది దోషం. ఏ వ్రతమైనా, ఏ దీక్షైనా నిరాహారంగా కొనసాగించాలని ఎక్కడా లేదు. సాధ్యమైనంతవరకు సాత్వికాహారాన్ని, నీ శరీరానికి హితమైనదాన్ని మితంగా స్వీకరించాలని శాస్త్రం చెబుతోంది. నీ శరీరాన్ని శోషింప చేసి నువ్వు సాధించేది ఏదీ లేదు. అందువల్ల పరలోకంలో వున్న నీ తండ్రి ఆత్మ క్షోభిస్తుందయ్యా. నే చెపుతున్నాను విను. అనూచానంగా వస్తున్న నీ ఆహార నియమాన్ని సడలించవలసిన అవసరం లేదు. నిస్సంకోచంగా, తరవాణి తిని నీ వృత్తికి బయల్దేరు ఎవరైనా ఆక్షేపిస్తే నన్ను కలవమని చెప్పు" అన్నారయ్యా సదాశివ శాస్త్రిగారు.

తేలికపడిన మనసుతో ఆయన పాదాలకి నమస్కరించాడయ్యా రామశాస్త్రి.

*

# కాలమ్ దాటని కథ

## 'ఆదిక్' రుష్ణుడు

ద్వారకా నగరంలో సుఖ సంతోషాలతో జీవిస్తున్న శ్రీ కృష్ణుడు ఒకసారి కులాసాగా, గడపడానికి హస్తినాపురానికి వెళ్ళాడు. అక్కడ అతనికి అఖండమైన మర్యాదలు, అపూర్వమైన స్వాగతము లభించాయి. నక్షత్రాల హోటల్లాంటి అంతఃపురంలో విలాసవతులతో సంతోషంగా కొన్నాళ్ళు గడిపేసాడు. తర్వాత ద్వారక వచ్చేయడానికని . పూలపల్లకిని సిద్ధం చేయించుకున్నాడు.



పల్లకిలో పూలమసస్తోంది. ఒక నవ యవ్వన సుకుమారి. రాత్రి అంతా మధువు తాగి ఉన్నాడేమో. ఆ మత్తు ఇంకా వదల లేదు శ్రీకృష్ణునికి. అది పల్లకీ అని ఆమె దాసి అని. తాను పరదేశిననీ: తాను పరమాత్ముడనని- అన్నీ మరచిపోయాడు. గభాలున ఆమె చెయ్యందుకున్నాడు.

ఆమె సిగ్గుతో కుంచించుకుపోయింది. "నువ్వు ఒక రాజువేనా?" అని అడిగింది. అప్పటికీ స్పృహలోకి రాలేదు శ్రీకృష్ణుడు. పాండవులు, ఇతర ప్రముఖులు వచ్చి అతన్ని సౌమ్యంగా మందలించి, పల్లకి ఎక్కించి వీడుకోలు చెప్పారు.

శ్రీ కృష్ణుడు క్షేమంగా, హాయిగా ద్వారక చేరుకున్నాడు. రెండు మూడు రోజుల వరకు ప్రజలు అతని ప్రవర్తన గురించి చెప్పుకొన్నారు. హేళన చేసారు. కాని తరువాత ఆయన హోదా, గౌరవమూ ఏదీ తగ్గలేదు.

నీతి: పెద్దలు చేసిన తప్పులు ఒప్పుగనే భావించవలెను.

—నేమాని ప్రసాద్